డి.సి.ఆర్.గ్రాట్యుయిటీ

హరికిషన్

సూపరింటెండెంట్ సుంద్రరావుని ఆఫీసరుగారు పిలుస్తున్నారని ప్యూనువచ్చిచెప్పాడు. అంతవరకూ వంచిన తల ఎత్తకుండా డిస్పోజల్సు చూస్తున్న సుంద్రరావు మెల్లిగా తలెత్తి జవానువైపు చూశాడు.

"ఆఫీసరుగారు పిలుస్తున్నారు" అన్నాడు ప్యూను మళ్లీ.

"నన్నా" అన్నాడు సుంద్రరావు మెల్లిగా.

"అవునుసార్ మిమ్మల్నే"

సుంద్రరావు కుర్చీలోంచి లేచి ఆఫీసరు రూంలోకి వెళ్లాడు. ఆఫీసరు కూడా వంచిన తల ఎత్తకుండానే కాగితాలు చూస్తున్నాడు.

"గ్రాట్యుయిటీ కేసులు మీ సెక్షన్‌లో చాలా డిలే అవుతున్నయ్యి. త్వరగా అన్నీ ఫైనలయిజ్ చెయ్యండి. వోసారి పెండింగ్ కేసులన్నీ పట్టాండి చూస్తాను" అన్నాడు ఏ. ఏ. ఓ. మోహన్‌రావు.

మరో పది నిమిషాల్లో గ్రాట్యుయిటీ పెండింగ్ కేసులన్నీ తెచ్చాడు సుంద్రరావు. అన్ని ఫైల్సూ సావధానంగా చూశాడు మోహన్‌రావు. అన్నీ చూసి నిర్లిప్తతగా "సరే, తీసుకు వెళ్లండి" అని ఒక సిగరెట్టు వెలిగించి నిరాశగా పొగ వదిలాడు మోహన్‌రావు. ఆ పొగ కూడా మెల్లిగా రింగులు, రింగులుగా తిరుగుతూ వ్యాప్తి చెందుతూ పైకిపోతూ చివరకు గాలిలో కలసి అంతర్ధానమైపోయింది.

"నీకు సిగరెట్ అలవాటులేదు కదూ" అన్నాడు మోహన్‌రావు.

"లేదుసార్" అన్నాడు సుంద్రరావు.

"సిగరెట్ పొగ చూశావా ఎట్లా అంతర్ధానమైందో"

అర్థం కాలేదు సుంద్రరావుకు.

"సంసార జీవితంలో ప్రవేశించిన ప్రతివారూ రింగు, రింగుమంటూ జీవిత వలయంలో పరిభ్రమిస్తూ వయస్సు పైపబడగా చివరకు ఆ పొగమాదిరే అంతర్ధానమై పోతారు. అట్లా అంతర్ధానమైపోయిన ఆ ఉద్యోగుల గ్రాట్యుయిటీలు మన ఉద్యోగ ధర్మం నిర్వర్తించుకోటానికిగాను వారి భార్యలకు సంక్రమింప చెయ్యాలి, అవునా" అన్నాడు మోహన్‌రావు.

అవునన్నట్లు తలవూపి ఫైల్సు తీసుకు వెళ్లాడు సుందరరావు. అంత హఠాత్తుగా ఎందు కతను వెళ్లిపోయాడో అర్థంకాక అటే చూస్తూ సిగిరెట్టు పీల్చాడు మోహన్‌రావు.

* * *

సుందర్,

పేరులో ఉన్న గొప్పతనం పెంపులోలేదు. నువ్వు నిర్వికారుడివైన సుందరుడివి. నీ మనస్సు అనిర్వచనీయమైనది. మమతలు పెల్లుబికి వచ్చినా ఆ ప్రవాహవేగం భయమూ, ఆందోళనా అనే రెండు కరకట్టల మధ్య ఒడ్డుల్ని ఒరుసుకుంటూ పోవలసిందే. జీవితం జీవించటానికే నంటారు కొంతమంది. ఆశయాలతో నింపుకున్న జీవితాలకు మెరుగులు దిద్దుకోవాలనుకుంటే, పట్టుదల, ఆత్మ విశ్వాసమూ, దృఢ సంకల్పమూ అనే గ్రూపును తీసుకుని "లోకానుభవం" అనే విశ్వ విద్యాలయంలో చదువుకోవాలి. అక్కడ డిగ్రీ తెచ్చుకుంటే జీవితంలో ప్రతి మెట్టూ ఆ విశ్వ విద్యాలయపు సర్టిఫికెట్‌తో ఎక్కిపోగలం. ఆ విశ్వ విద్యాలయంలో చేరిన మనిద్దరమూ ఎంత చదివినా ఆ గ్రూపులోని పాఠాలు అర్థం కాక తప్పుతున్నాము.

కాలేజిలో చేరిన మొదటి రోజుల్లో ప్రబంధ కావ్యాల్లోని నాయికల్లాగా, జానపద చిత్రాల్లోని హీరోయిన్‌లాగ నన్ను వర్ణిస్తూ, నువ్వు రాసిపెట్టుకున్న ఒకలేఖ పొరపాటున నీ నోట్సు పుస్తకంతోబాటుగా లెక్చరరు దగ్గరకు చేరింది. లెక్చరరు ఆ కాగితాలు చూసి కోపం పట్టలేక మాటలు తడబడుతూ "ఎవరోయ్ ఈ అపర, అపర......" అంటుండగా వెంకటావనే అతను "ప్రవరాఖ్యుడా,

దుష్యంతుడా అంటీ" అన్నాడు. క్లాసంతా ఒకటే గోల. ఆరోజులు తల్చుకుంటే హృదయం ఉప్పొంగి మనస్సు పరవళ్ళు తొక్కుతుంది.

కాని ఆదిమధ్యాంతాలులేని కాలం, ఆ గర్వం కలసిపోయిన మనం ఎల్లకాలం విశ్వ విద్యాలయాల్లోనే చదువుకోగలమా? కలకాలం చదివినా ప్యాసవుతామనే నమ్మకమూ లేదుకదా?

ఆలోచనలతో సతమతమై సమస్యను మరింత జటిలంగా చేసుకునేకన్న, సమస్యలు లేని ప్రశాంత సీమల్లోకి నిష్క్రమించ గలమా! నళిని.

* *

సుందర్,

మొన్న మనం సినిమా హాల్లో శలవని తొలిసారిగా కల్సుకున్నప్పుడు మనం పక్క పక్కనే కూర్చుని హృదయాలువిప్పి మాట్లాడుకున్నప్పుడు, మన ప్రపంచంలో మనం ఉండి చుట్టుపక్కలవార్ని గమనించనే లేదు. ఫలితం ఇంట్లో అమ్మ పెట్టిన తిట్లూ చివాట్లూ, నాన్నగారి కోప తాపాలూ, వీటన్నిటికీ తలొగ్గి తట్టుకోవలసి వచ్చింది. కాని, నీకోసం అవన్నీ చిరునవ్వుతో ఎదుర్కొని భరించాను. అమ్మా, నాన్నా కోప్పడ్డారని నీ చెలిమిని దూరం చేసుకుంటే ఇంక నా వ్యక్తిత్వం ఏముంది? జీవితానికి ప్రాణం ఎంత ముఖ్యమో వ్యక్తిత్వమూ అంత ముఖ్యమే.

అన్నింటికన్న ముఖ్య విషయం. ఈ వేసవి శలవుల్లోనే మా అక్కయ్య పెళ్ళి. తరువాత ఛాన్సు మనదేకదూ! అందుకు తగిన వాతావరణం మనం కల్పించుకోవాలి కదా! నీ,

నళిని.

* * *

మేనెల్లో తన అక్కయ్య పెళ్ళి శుభలేఖ సుందర్రావుకు పోస్టు చేసింది నళిని. శుభలేఖతోపాటు పెద్ద ఉత్తరం. ఉత్తరం చదివినంత ధ్యాసగా శుభలేఖ చదవలేదు. ఈ పెళ్ళికి తను ఎట్లా, ఎవరి తరఫుని, ఏ బాంధవ్యరీత్యా వెళ్ళాలి? పెళ్ళింకా పది రోజులుంది.

మర్నాడు పోస్టులో ఇంకో శుభలేఖ వచ్చింది. ఎవరిదోనని మామూలుగానే చదివాడు. కళ్ళు మిరుమిట్లు గొలిపాయి. శరీరం ఉప్పొంగిపోయింది. మనస్సంతా అమితానందంతో నిండిపోయింది. నళిని అక్కయ్య వనజ పెళ్ళి తమ దూరపు బంధువర్గంలో తనకు పెత్తండ్రి వరుస అయిన వెంకట్రావు గారి కొడుకు సూర్యారావుతోనే.

మగపెళ్ళివారి తరఫున తనూ పెళ్ళికి వెళ్ళాడు సుందరరావు. ఉన్న రెండు రోజుల్లోనూ ఇరవైసార్లు నళినిని చూశాడు. ఎట్లాగో వీలు చూసుకుని నాలుగుసార్లు మాట్లాడాడు ఎవ్వరూ చూడకుండా. ఆ రెండు రోజుల్లోనూ, నాలుగుసార్లు కల్సుకున్నప్పుడూ రెండు సంవత్సరాల మాటలు మాట్లాడుకుని హర్షపులకాంకితులయ్యారు. వింత వింత సోయగాలతో, రంగు రంగుల చీరెల్లో, రమణీయమైన అలంకారాల్లో, కమనీయమైన మాటల్లో కన్నుల పండుగగా చూశాడు సుందర్రావు నళినిని.

జూన్‌లో కాలేజీలు తెరిచారు. గుంటూరు చేరాడు సుందర్రావు. తెనాలినుంచి మళ్ళీ చదువుకు నళిని రాకకై ఎదురుచూస్తున్నాడు. నళిని రాలేదు. ఉత్తరంలేదు.

మరోవారం గడిచింది. ఎదురుచూస్తున్న ఉత్తరం రానే వచ్చింది. సంతోషంతో కవరు చించాడు. గుండెలు పగిలినయ్యి. కన్నీటి మసకతో అలుక్కుపోయినట్లు కనబడే అక్షరాలను కూడబలుక్కుని చదివాడు.

నళిని అక్కయ్య వనజ నాలుగు రోజులు జ్వరం తగిలి ఈ లోకాన్ని విడిచిపోయింది. పెళ్ళయిన రెండోమాసంలోనే వనజకు ఆయుష్షు తీరిపోయింది. తండ్రిగారికి తెనాలి నుంచి, విశాఖపట్నం బదిలీ అయింది. ఎల్లుండే ప్రయాణం. ఇంక నళిని కాలేజి చదువు లక్కడే — అని ఆ ఉత్తరం సారాంశం.

ఆరోజునే ఏమీ ఆలోచించకుండా తెనాలి వెళ్ళి నళిని తల్లి దండ్రుల్ని పలకరించాడు. నళిని నిర్జీవ ప్రతిమలా కనుపించింది. మేనెల్లో పెళ్ళయిన అక్కయ్య, జూన్‌నెలలో చనిపోతే ఇంక అంతకన్న ఘోరం ఏమిటని విలపించింది నళిని. తల్లిదండ్రుల దుఃఖానికి అంతులేదు. వాళ్ళు పూర్తిగా విచార సాగరంలో మునిగిపోయి పడ్డుకు రాలేకపోతున్నారు. పెళ్ళికి వెళ్ళినపుడు ఆనాడు చూసిన ఆ ఇంటివాతావరణానికీ, ఈనాటి వాతావరణానికీ ఎంత మార్పు? ఆనాటి పెళ్ళిల్లు స్వర్గవాటిక. ఈనాటి ఆఇల్లు స్మశానవాటిక. ఆనాటి నళిని అందమూ, ఆనందమూ, ఆప్యాయతా, ప్రేమానురాగాలూ పుణికి పుచ్చుకున్న అందాలబాల. ఈనాటి నళిని శోకమూర్తి. ఆమె సోయగమంతా దుఃఖ సముద్రంలో కరిగిపోయింది. నళిని పరిస్థితి చూసి తనూ కన్నీరు పెట్టుకున్నాడు.

వనజను గురించి, ఆమె మనస్తత్వాన్ని గురించి నళిని చెప్పుతుంటే అలాంటి సహృదయులకు ఈ లోకంలో ఎక్కువ కాలం స్థానం లేనట్లుగా అనుకుని తనూ విచారపడ్డాడు. అవ్యక్త స్వరాలతో, బరువెక్కిన హృదయంతో గుంటూరు చేరుకున్నాడు. జీవిత గమనంలో అంతలో ఎంత మార్పు?

* * *

సుందర్,

ఇంత ఆలస్యంగా ఉత్తరం రాశానని [illegible]గించుకోకు. ఇక్కడ కాలేజి, కొత్త వాతావరణం కొంత కారణంగా తీసుకోవచ్చు. చక్కని తారురోడ్డుమీద పరుగెత్తుతున్నా గమ్యస్థానాన్ని చేరుకోటానికి ఆ పొడుగాటి తారురోడ్డే ఆధారంకాదు. కొన్ని మలుపుల తిరగాలి. జీవితమార్గంలో కూడా ఇలాంటి మలుపులు తప్పవు. అమ్మా, నాన్నా నామీదనే ప్రాణాలు నిల్పుకుని బ్రతుకుతున్నారు. ఇది ఇంటి విషయం.

ఇంక కాలేజీ సంగతి. నేను చదువుతున్నది బి.యస్సీ అని నీకు తెల్సు. కొత్త వాతావరణం, [illegible] ఎదిరిస్తూ మోహనరావనే ఎమ్. ఎస్. సి. విద్యార్థితో పరిచయమైంది. ఆ కొద్ది పరిచయం ఆ [illegible] రంతోనే దాని [illegible] ప్రేమ అనే మత్తులోనే ముంచివేయాలనుకున్నాడు. ఆ సాహసం నాకు ఏమాత్రం నచ్చలేదు. అ నితో మాట్లాడటం తప్పించుకు తిరుగుతున్నా, ఎట్లాగో తారసపడి, కల్పించుకుని నాతో మాట్లాడ్డానికి ప్రయత్నిస్తున్నాడు. ఇదేం ఖర్మమో నాకు అర్థంకావటంలేదు. నా అయిష్టతనూ, కోపాన్నీ నాతో దిగమింగుకుని ఏదిమాటలకు ఒక మాటలిమాటగా జవాబు చెప్తున్నాను. ఒక్కసారే ముఖంమీద కొట్టినట్లు తిరస్కారభావంగా మాట్లాడితే అంత పద్ధతి ఉండదేమో? నీ,

నళిని.

ఉత్తరం చదువుతుని బరువుగా నిట్టూర్చాడు సుందర్రావు. ఉరకలు వేసే మనస్సులో కలత వేసింది. కలత వేసిన మనస్సులో ఇదివరకటి పలుకుకు స్థానం లేదు. తనకు తెలియకుండానే నళిని తనకుదూరమై పోతున్నట్లుగా భావించాడు. ఈ ఉత్తరానికి చిన్న సమాధానమే రాశాడు.

నళినీ,

ఉత్తరం చదివి ఉన్మత్తుణ్ణి కాలేదు. నీ జీవితం సార్థకం చేసుకోటానికి ఎ

మలుపులు తిప్పుకోవాలనుకున్నావో అన్ని మలుపులూ తిప్పుకో. ఏ మలుపులోనైనా నేను కనిపిస్తానేమో చూస్తావుకదూ!

సు ం ద ర్.

ఉత్తరం చదువుకున్న నళిని ఖిన్నురాలైంది. పాశ్చ్య పుస్తకాలకు నోట్సులు అనేక మంది అనేక తరహాలుగా రాసినట్లుగా హృదయానుభూతులకు మనస్సులోని వ్యాఖ్యానాలు కూడా అనేక రకాలుగా చిత్రించు కుంటారనుకుంది నళిని. ఉత్తరానికి జవాబు ఆగష్టు పదిహేనున రాసింది.

సుందర్,

మనదేశంలో ఆబాలగోపాలం ఈరోజున స్వాతంత్రోత్సవాలు జరుపుకుంటున్నారు. ఈరోజు అందరికీ పర్వదినం. అలాంటి పర్వదినంనాడు నేను నీ కీ ఉత్తరం రాస్తున్నాను.

నువు నన్ను అపార్థం చేసుకున్నందుకు నేను బాధపడినా నీమీద ఏమాత్రం కోపం తెచ్చుకోవటంలేదు. నేనేకాదు ఆ పరిస్థితుల్లో ఎవరున్నా అంతేనేమో! నా జీవిత ప్రవాహం ఎన్ని మలుపులు తిరిగినా ప్రతి మలుపులోనూ నువ్వే కనిపిస్తావు. నువ్వు లేని మలుపు లేనేలేదు. నీ,

న ళి ని.

* * *

ఆఫీసరుదగ్గరనుంచి వచ్చి తన సీటులో కూర్చున్న సుందర్రావు మనస్సులో ఈ సంఘటనన్నీ ఒక్కసారి గిర్రున తిరిగాయి.

"సార్, కాఫీ తెమ్మంటారా" అన్న ప్యూను మాటలతో పూర్వలోకంనుంచి, ఈలోకంలోకి వచ్చినట్లయింది. కళ్ళు తుడ్చుకుని ప్యూనుకు డబ్బులిచ్చి పంపాడు.

* * *

మోహన్రావు అసిస్టెంట్ ఎకౌంట్స్ ఆఫీసరుచేస్తూ, పదేళ్లుగా ఉద్యోగంలో ఉన్నా, ఎప్పుడూ ఆఫీసు కాయితాలు ఇంటివద్ద ముట్టలేదు తటస్థించలేదు. పని ఎక్కువగా ఉంటే ఇంకాసేపు కూర్చుని ఫైల్సన్నీచూసి సంతకాలుపెట్టి ఇంటికి వెళ్ళేవాడు. ఇంటికి రాగానే భార్యా పిల్లలతో కులాసాగా కబుర్లు చెప్పటమో, షికారుకో, సినిమాకో వాళ్ళను తీసుకు వెళ్ళటమో జరిగేది.

అటువంటిది ఆ గ్రాట్యుయిటీ ఫైలు నాలుగు రోజులనుంచీ ఇంట్లో టేబుల్ మీద ఉండటం చూసేసరికి భార్య అరుణకు ఆశ్చర్యం కలిగింది.

"ఆ ఫైలు నాలుగు రోజులనుంచీ అక్కడే ఉన్నది. తొందరలేదా" అన్నది అరుణ నవ్వుతూ.

డి.సి.ఆర్. గ్రాట్యుయిటీ

"అదొక గ్రాట్యుయిటీకి సంబంధించిన ఫైలు. తొందరగా పంపించవలసిందే. ఏమిటో ఆలస్యమైంది" అన్నాడు నిర్లిప్తతగా.

"ఇంతవరకూ ఏ అయిదారొందల పెన్షన్లూ, గ్రాట్యుయిటీ ఫైల్సూ చూసి ఉంటారు. ఇందులో కొత్తేముంది" అన్నది మళ్ళీ అరుణ.

"అవును. కొత్తేముంది. ఏమాత్రకయినా ఆ ఫైలు చూడాలి" లేని నవ్వుతెచ్చుకుని అన్నాడు మోహన్రావు.

* * *

"నళినీ"

"ఊఁ"

"నేనంటే కోపంకదూ"

"తెల్సి కూడా అడగటం ఎందుకూ"

"నిజంగా కోపం వచ్చిందా"

"అక్షరాలా"

"ఎందుకని"

"ఎమ్మే చదువుతున్నా మానవునిలో, అందులో చదువుకున్న వ్యక్తిలో ఉండవలసిన ఔన్నత్యం మీలో వ్యర్థమైపోయింది. ఇట్లా వెంటబడి తిరగటం నాకేం బాగుండలేదు"

"నువ్వు నన్ను అర్థం చేసుకోలేదు నళినీ"

"కాదు. పూర్తిగా అర్థం చేసుకున్నాను. నన్ను మీరు ప్రేమిస్తున్నారు. పెళ్లి చేసుకుంటాననంటారు. కాని నేనుమాత్రం మిమ్మల్ని ప్రేమించటంలేదు. అంతే తేడా. ఇప్పుడు నా మాటలు మీకు అర్థమవుతున్నయ్యా"

"అవును నళినీ, నువ్వు నన్ను ప్రేమించి ఇష్టపడితే వివాహం చేసుకుందామనే ఉంది"

"సంతోషం. కాని నాకా ఉద్దేశ్యం లేదనే చెప్పానుకదా. ఇక ముందు కూడా ఏనా విషయంలో నాకా ఉద్దేశ్యం కలగదు. నమస్కారం."

నళిని విసవిసలాడుతూ తిరిగి చూడకుండా వెళ్లిపోయింది. మోహనరావు శిలాప్రతిమలా అయిపోయాడు. మర్నాడే మళ్లీ నళినితో కల్పించుకుని మాట్లాడాడు.

"నళినీ"

"ఎందుకు"

"చిన్నమాట"

"నన్ను ప్రేమిస్తున్నట్లుగా చెప్పటానికేకదూ"

"అవును"

కోపంగా చూసింది నళిని.

"నేను నిన్ను ఎంతగా ప్రేమిస్తున్నానో, నువ్వు నన్నంతగా త్యజీకరిస్తున్నావని తెలుసు. ఏ పరిస్థితుల్లో మనకు పరిచయమైందో నీకు గుర్తుందనే అనుకుంటాను. నన్ను ప్రేమించినా ప్రేమించక పోయినా, పలకరిస్తే అంత చులకనగా కోపంగా ఎందుకు సమాధానం చెపుతున్నావో నాకు అర్థం కాలేదు. ఆఖరుసారిగా ఒక్కమాట అడుగుతున్నాను. నీ జీవితంలో ఎప్పుడో ఒకసారి నా సాయం పొందక తప్పదు. అది ఏ రీతిగా ఉంటుందో నేను చెప్పలేను" అన్నాడు మోహన్రావు.

చులకనగాచూసి, నిర్లక్ష్యంగా నవ్వుతూ వెళ్లిపోయింది నళిని.

* * *

రెండేళ్లు కాలచక్రంలో కలిసిపోయాయి. మోహన్రావు ఎమ్మే ఫస్టు క్లాసులో ప్యాసయ్యాడు.

ఒకరోజున అతని కొక కవరు వచ్చింది. కవరుచించి ఉత్తరం తీశాడు. దానితో పాటుగా శుభలేఖ. నళిని వివాహం. వరుడు ఆనందరావు. ప్రొబేషనరీ డిప్యూటీ తాసిల్దారు. ఉత్తరం చదువుకున్నాడు.

మోహన్,

జీవితంలో అనుకోని సంఘటనలూ, సన్నివేశాలూ అనేకం. ఒక వ్యక్తియందు మనకు ఇష్టత లేనప్పుడు ఆ వ్యక్తి పలకరిస్తేనే మన అహం దెబ్బతిన్నట్లయి ఇంగిత జ్ఞానాన్ని వెనక్కునెట్టి నోటికి వచ్చినట్లుగా మాట్లాడుతాం. ఇందుకు తార్కాణం మనమే, కాదు నేనే.

ఆరోజున నువ్వన్నమాట నాకు అనుక్షణమూ చెవుల్లో మారుమ్రోగుతూనే ఉంటుంది. అందుకే శుభలేఖతోపాటు ఈ ఉత్తరాన్ని రాస్తున్నా.

మా పెళ్లికి తప్పక రావాలిసుమా!

న ళి ని.

ఉత్తరం చదువుకుని మనస్సులో నవ్వుకున్నాడు. శుభలేఖ అందంగా ఫోటోలతోసహా అచ్చు వేయించారు.

* * *

గ్రాట్యుయిటీ ఫైలు చదువుతున్న మోహన్రావుకు పై సంఘటనలు గుర్తు వచ్చినయి. అతనికి పెళ్లి శుభలేఖలు బంధువులవీ, స్నేహితులవీ ఎన్నో వచ్చేవి. ఎప్పటి కప్పుడు ఏమైపోయేవో తెలిసేదికాదు. కాని నళిని పెళ్లి శుభలేఖమాత్రం ఇన్ని

సంవత్సరాలూ జాగ్రత్తగా దాచాడు. ఎందుకో ఆలోచిస్తే అతనికే అర్థం కాలేదు. పెళ్ళికి అప్పుడు వెళ్ళనూలేదు. ఉత్తరానికి జవాబూ వ్రాయలేదు. టెలిగ్రాం ద్వారా ఆరోజున గ్రీటింగ్స్ పంపాడు. అంతటితో ఆ బాధ్యత అట్లా తీరిపోయింది.

బీరువాలోని పాత కాయితాలన్నీ తీశాడు. ఎన్నెన్నో కాయితాల కట్టలు తీసివేతి కాడు. ఆఖరికి ఆనాటి నళిని పెళ్లి శుభలేఖ కనిపించింది. కాగితాల కట్టలన్నీ బీరువాలో సర్ది, ఆ శుభలేఖను కనీసం అయిగారుసార్లు చదివాడు. అప్రయత్నంగా రెండు కన్నీటిబొట్లు ఆ శుభలేఖమీద పడ్డాయి. నళినితో తన స్నేహానికి చిహ్నమైన వస్తువు ఆ శుభలేఖ ఒక్కటే. ఆ శుభలేఖ చదువుతుంటే మనస్సునీ, హృదయాన్నీ కెలికినట్లయింది.

రాత్రి పన్నెండింటికికాని ఫ్లైలు ముయ్యలేదు మోహన్‌రావు.

* * *

ఆరోజున శలవు పెట్టాడు సుందరావు. ఏమిటో ఆలోచన, భీతి, దిగులు, అతని భార్యా పిల్లలూ చుట్టాలింట్లో పెళ్లికి వెళ్ళారు. తనుమాత్రం వెళ్ళలేదు. వెళ్లాలనిపించలేదు. ఉన్నట్టుండి కుర్చీలోంచిలేచి పెట్టెల్లోని పాత కాగితాలకట్టలన్నీ తీశాడు. దస్తావేజులూ, పాత ఉత్తరాలూ, తండ్రి చేసిన బాకీలు, తీర్చిన ప్రోనోట్లు, ఆ కసరు ఉత్తరం వచ్చి ఎన్ని సంవత్సరాలో అయింది. కాని నిన్న, మొన్న వచ్చిన భావన మనస్సులో కలిగింది. మళ్లీ ఒకసారి ఉత్తరాన్ని చదువుకున్నాడు.

సుందర్,

ఉత్తరాలు రాయటం లేదని కోపం వచ్చిందికదూ! నీకు నామీద కోపం వచ్చినప్పుడే నాకు సంతోషంగా ఉంటుంది. కోపంలోనే నువ్వు సూటిగా సూట్లాడుతావు. అవునా?

జీవితం ఒక బొమ్మలాట. బొమ్మ నిర్జీవమైనది. మనిషికి ప్రాణం ఉన్నది. బొమ్మకు ఆశలులేవు. మనిషికి ఎన్నో ఆశలూ, ఆశయాలూ. మనం ప్రేమించుకున్నామనీ, హృదయాలు ఇచ్చిపుచ్చుకున్నామనీ మనం అనుకుంటున్నాం. ఆ అనుకున్నాం. మనస్సులో అనేక అనుభూతులు నింపుకుని మాటల్లో చెప్పుకున్నాం. ఒకర్ని విడిచి ఒకరం విడిపోకూడదని చందమామ సాక్షిగా, తారకల సాక్షిగా మన మనస్సాక్షిగా అనుకున్నాం. ఎన్నో వూహలు రేపుకుని మమతల్ని పెంచుకున్నాం.

కాని ఆ పరమాత్ముడు తన లీలలన్నీ మనమీదనే ప్రయోగించాడు. ఆయన ప్రయోగాలకి మనమే దొరికామేమో! నీమీద ప్రేమతో, నీతోడిదే లోకమనే మోజుతో, ఏనాటికయినా మనం భార్యాభర్తలం అవుదామనే వాంఛతో, కాంక్షతో వళ్లంతా కళ్ళు చేసుకుని, నిన్నే చూడటంతో నాకు ఎవ్వరూ కనుపించలేదు. కనిపించిన మోహన్‌రావుని కసిరికొట్టాను. అతడు ఖిన్నుడై 'కిమన్నాస్తి' అయ్యాడు. జయించాననుకున్నాను.

కాని ఆశలకు శలలు వేసినయ్యి. కళ్లకు ఎవరో గంతలు కట్టారు. మన ప్రేమ సెలయేరై, వాగై, నదియై, మహానదిలా పరవళ్లు తొక్కుతూ, మన ఇరువురి హృదయాలనే కరకట్టల నడుమ ఒరుసుకుంటూ, మన హృదయాల్ని ముద్దుపెట్టుకుంటూ ప్రవహిస్తుంటే, మన మనస్సుల్ని ఆ నది ప్రవాహంలో ముంచి, తేల్చి తరింపచేద్దామనుకోగా, ఆ మహానదికి అమ్మా, నాన్నా అనే ఆనకట్ట అడ్డుగా నిల్చింది. ఆ ప్రవాహ వేగాన్ని ఆటంకపర్చవద్దని కన్నీరు మున్నీరుగా ఏడ్చాను. నచ్చచెప్పాను. బ్రతిమాలాను. కాని అమ్మా, నాన్నా నాలుగు ముక్కలు చెప్పారు.

"నళినీ, ఒక్కగా నొక్కరైతే మిగిలావమ్మా. అక్కయ్య ఆ తీరుగా మా కడుపులో చిచ్చు పెట్టిపోయింది. ఆ వంశంలో వాళ్లందరికీ రెండో పెళ్లి గీత ఉందట. ఫలితం అక్కయ్య నెలదాటంగానే పోయింది. మళ్లీ ఇంతా తెలిసి ఆ వంశంలో, ఆ కుటుంబంలో వాడేఅయిన సుందర్రావును, మా బొందిలో ప్రాణంఉండగా మా ఇంటి అల్లుడిగా తెచ్చుకోము. అతను కావాలో, మేం కావాలో ఆలోచించుకో. మేం చూసిన సంబంధం కూడా ఎంతో మంచిది. గొప్ప సంబంధం. అతనూ యోగ్యుడే. ప్రొహిబిషనరీ డిప్యూటీ తాసిల్దారు చేస్తున్నాడు. కనీసం కలెక్టరయినాచేసి రిటయిరవుతాడు" అంటూ చెప్పారు. కాదంటే అమ్మ ప్రాణ త్యాగం చేస్తానంది.

ఎవరో పూర్వులు అన్నట్లు పెళ్ళిళ్ళు ఎప్పుడో స్వర్గంలోనే అవుతయ్యట.

దాని ఫలితమే నా పెళ్లి.

ఇందులో శుభలేఖ పంపుతున్నా. న

కోసం కాకపోయినా, ఇన్నాళ్ళూ ఈ స్నేహితురాలిగా ఉన్న ఈ అభాగ్యురాల్ని ఆశీర్వదించి, నాలుగు అక్షతలు నా నెత్తిన వెయ్యటానికయినా రమ్మని ప్రార్థిస్తున్నాను. నీ అక్షతలకోసం, నీ ఆశీర్వాదంకోసం వెయ్యి కళ్లతో చూస్తుంటాను. పెళ్లి పందిట్లో నువ్వు కనబడితే నాకు తృప్తి. తప్పక వస్తావని ఆశిస్తున్నాను.

ఏముఖం పెట్టుకుని నళిని పెళ్లికి వెళ్ళాలి? నన్ను మోసగించిన పాపాత్మురాలికి మళ్ళా నా ముఖం చూపించటమా! నన్ను ప్రేమించి, ఇంకొకరి భార్య కావటం నేను నా కళ్లతో చూడాలా? పెళ్లి కూతురుగా నా పక్కన కూర్చోవలసిన నళిని ఇంకొక వ్యక్తి పక్కన కూర్చుంటే సిగ్గులేక నేను ఆశీర్వదించటానికి వెళ్ళాలా? ఇట్లా నువ్వనుకోవచ్చు. ఇంకా అనేక విధాలుగా నన్ను దూషించవచ్చు. కాని ఒక్కసారి ఆలోచించు. మనిద్దరి జీవిత విశేషాలనూ సంస్మరించుకుని ఒకర్నిచూసి మరొకరు, మనఃక్లేశాన్ని క్షాళితం చేసుకోవటానికి ఇంతకన్న మనకు అవకాశం ఎప్పుడు కలుగుతుంది? ఆరోజునుంచీ నేను పరాయి సొత్తుని, పరస్త్రీనేకదా? ప్రేమించిన యువతిని పెళ్లి చేసుకుని స్వర్గధామంలో విహరించేకన్నా, ఇంకొక వ్యక్తిని ఆమె భార్య కాబోతున్న సందర్భంలో నాలుగు అక్షతలువేసి నిండు సహృదయంతో ఆశీర్వదిస్తే, ఆ మానసిక ఆందోళన ఎలా ఉంటుందో అనుభవపూర్వకంగా తెల్సుకుంటువుగాని. ఇంక నేనంటావా, మనస్సాక్షికి అర్పించి, మనిషిని ఒకరి స్వాధీనంలో ఉంచబోతున్న నిర్భాగ్యురాలిని. అలాంటి జీవితం ఎట్లా గడపాలో నేనూ చవి చూడాలికదూ!

నళిని.

* * *

మనస్సు రాయి చేసుకుని, నళిని కోరిక మీద పెళ్లికి వెళ్ళాడు. బ్రహ్మాండంగా ఎంతో అట్టహాసంగా పెళ్లి జరిగింది. అందరి హృదయాలూ, మనస్సులూ ఆనందంలో తొణికిసలాడినయ్యి. తామిద్దరి హృదయాలూ, మనస్సులుమాత్రం వ్యధతో కృంగిపోయినయ్యి.

అందరితోబాటుగా తనకూ్కడా పురోహితుడు అక్షతలు ఇచ్చాడు, మంగళసూత్రం గుప్పెట్లో ఉంచుకుని. అందరితోబాటే అక్షతలు తీసుకున్నాడు.

డి.సి.ఆర్. గ్రాట్యుయిటీ

మంగళ తూర్యారావములు ఘూన ఘోంతరాళాలు దద్దరిల్లేటట్లుగా మ్రోగినయ్యి. అందరితోబాటుగా తనూ అక్షతలు వేశాడు. ఇంకా సగం గింజలు చేతులోనే మిగిలినయ్యి. వాటిని మెల్లిగా ఎవరూ చూడకుండా, ఆ ఉత్తరం ఉన్న కవరులో వేశాడు.

* * *

ఈనాడు ఆ ఉత్తరంతో పాటుగానే ఆనాటి అక్షతల గింజలు కూడా కవరులోనుంచి కింద పడ్డయ్యి. కవరుసాంతం దులిపి అక్షతులన్నీ కిందపోశాడు. పిచ్చుకలు రివ్వునవచ్చి తినేసినయ్యి. అవి పదిహేనేళ్లనాటి అక్షతలు. ఆ పిచ్చుకలు ఆ అక్షతల బియ్యపు గింజల్ని తింటుంటే చిన్న పిల్లాడిలా గుబులు గుబులుగా దుఃఖం పొంగి పొర్లుకొచ్చి కన్నీరు పెట్టుకున్నాడు సుందర్రావు.

పిచ్చుకలు ఒక్కగింజా మిగల్చలేదు. ఉత్తరం కవరులోపెట్టి కవరు జేబులో పెట్టుకున్నాడు. నళిని రాసిన అన్ని ఉత్తరాలూ చించేసి ఆమె జ్ఞాపకార్థం ఆ ఆఖరి ఉత్తరం అట్టేపెట్టాడు. ఎవ్వరికీ కనబడకుండా ప్రాణపదంగా ఈ పదిహేనేళ్ళూ దాచాడు. నేటికి ఆ ఉత్తరాన్ని జేబులో పెట్టుకున్నాడు.

* * *

మర్నాడు ఆఫీసుకు వెళ్లగానే మోహన్‌రావు పిల్చాడు సుందరావుని. అతను వెళ్ళాడు. "ఇదుగోనోయ్ గ్రాట్యుయిటీ శాంక్షను చేశాను. టైపు చేయించి ఇవ్వాళే ఆర్డర్లు పంపించు" అంటూ బరువెక్కిన హృదయంతో ఫైలు ఇచ్చాడు. మోహన్‌రావు అంతకన్న బరువెక్కిన హృదయంతో, మనఃక్లేశంతో ఫైలు తీసుకున్నాడు సూపరింటెండెంట్ సుందర్రావు.



"ప్రేమలేఖ మీకు రాస్తే అది మీ నాన్న కిచ్చారేవండీ?"

మోహనరావు ఎకౌంటెంట్ జనరల్ ఆఫీసులో అసిస్టెంటు ఎకౌంట్స్ ఆఫీసరు. అదే ఆఫీసులో సుందర్రావు సూపరింటెండెంటు. ఇద్దరికీ పెన్షన్లూ, గ్రాట్యుయిటీలూ చూసే సెక్షను.

ఆరోజునే ఆర్డర్లు అంటే "డెత్—కం—రిటైర్‌మెంట్ — గ్రాట్యుయిటీ" ఆర్డర్లు డిస్పాచ్ చేయించాడు సుందర్రావు.

ఇరువురి హృదయాలూ అవ్యక్త వ్యధలతో తేలిక పడినయ్యి. తమ తమ బాధ్యతలు అంతటితో తీరినవనుకున్నారు. ఎవరికి వారు.

ఆరోజు ఆదివారం. సాయంత్రం నాలుగ్గంటలయింది. హిమాయత్‌నగర్‌లో ఒక యింటిముందు జనం గుమికూడిఉన్నారు.

"ఇద్దరు పిల్లల తల్లి. భర్తపోయి మూడు నెల్లయింది. ఆయన తాసిల్దారుచేస్తూ, మూడు నెలల క్రితమే చనిపోయాడు. ఆయన పేరు ఆనందరావుగారు. భర్త తాలూకు గ్రాట్యుయిటీ డబ్బు దాదాపు నాలుగు వేలు శాంక్షను చేసినట్లుగా గవర్నమెంటునుంచీ నిన్ననే ఆర్డర్లు వచ్చినయ్యి. ఆడబ్బు ఆవిడ చేతికి రాకుండానే ఇవ్వాళ హఠాత్తుగా పోయింది. ఏమిటో పాపం. ఆ ఇద్దరు పిల్లలకూ ఇంక దిక్కెవరో" అంటున్నారు అక్కడ మూగిన జనంలో ఒకరు.

దగ్గరగా నిల్చుని శవాన్ని చూస్తున్న సుందర్రావు కంట తడిపెట్టి కళ్లు తుడ్చుకున్నాడు. ఆ పోయిన నావిడకు దగ్గరబంధువు కామాలనుకుంటున్నారు అంతా. అంతలో అతని భుజంమీద చెయ్యి పడింది. వెనక్కు తిరిగి చూశాడు. అసిస్టెంట్ ఎకౌంట్సు ఆఫీసరు మోహన్‌రావు, తనూ కళ్లొత్తుకుంటూ నిల్చున్నాడు శవాన్నిచూస్తూ.

దహన సంస్కారాలకి ఏర్పాట్లన్నీ బంధువులు చేస్తున్నారు. చేరువలోఉన్న ఆమె పిల్లల్ని పిల్చాడు సుందర్రావు.

"మీపేరేమిటిబాబూ"

"నాపేరు సుందర్రావు. తమ్ముడుపేరు మోహన్‌రావు. మా అమ్మపేరునళిని. ఈవాళే చచ్చిపోయింది" అన్నాడు పెద్దవాడు ఏడుస్తూ. ●